# రజతోత్సవ సభకు దండులా కదిలిరావాలి

- బీఆర్ఎస్ పాలనలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి
- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్ రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా నాయకుడు శ్రీనివాస్ రెడ్డి

చిగురుమామిడి, ఏప్రిల్ 10 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీశ్రేణులు దండులా తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మండలంలో మూడువేల మందికి తగ్గకుండా ఎల్కతుర్తిలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ శ్రేణులు హాజరుకావాలన్నారు. సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణను సస్యశ్యామలంగా మార్చారని, సాగు, తాగునీరు, ఉచిత కరెంట్, రైతు బీమా, రైతుబంధు, అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు ఉందని, రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలో 50 బస్సులకు తగ్గకుండా గ్రామాల వారీగా ఏర్పాటు చేశామని, గులాబీ శ్రేణులు స్వచ్ఛందంగా సభకు తరలిరావాలని కోరారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, పీఏసీఎస్ చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీలు కొత్త వినీత, ఆకవరం భవాని, నేతలు సాంబారి కొమురయ్య, రామోజు కృష్ణమాచారి, శివప్రసాద్ ఉన్నారు.

# ఆటోలో జిలెటిన్ స్టిక్స్

- ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో వెలుగులోకి
- కాటన్ బాక్స్‌లను డ్రైనేజీలో పడేసి పారిపోయిన ఆటో డ్రైవర్
- స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు


ఆటోలో లభించిన జిలెటిన్ స్టిక్స్

గంగాధర, ఏప్రిల్ 10: రోడ్డు ప్రమాదంతో ఆటోలో పేలుడు పదార్థాలు బయటపడ్డాయి. అక్రమంగా తరలిస్తున్న 600 జిలెటిన్ స్టిక్స్ దొరికాయి. ఎస్ఐ వంశీకృష్ణ వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి జగిత్యాల వెళ్తున్న ఆర్టీసీ బస్సు (టీఎస్ 02 టీ 1770).. కరీంనగర్ వైపు వెళ్తున్న ఆటో (ఏపీ36 టీబీ 5246/ ఏపీ36 డబ్ల్యూ 6231 నంబర్లు ఫేక్) గంగాధర మండలం మధురానగర్ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారిపై గురువారం ఢీకొన్నాయి. బస్సు ముందు భాగం డ్యామేజీ కాగా, కాగా ఆటో డ్రైవర్ పారిపోయాడు. బస్సు డ్రైవర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు గంగాధర పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఆటోను తనిఖీ చేయగా అందులో కాటన్ బాక్స్, రెండు సంచుల్లో 600 జిలెటిన్ స్టిక్స్ ఉన్నట్టు గుర్తించారు. వీటితోపాటు డికార్ట్ వైర్ బెండల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ ₹12,500 వరకు ఉంటుందని చెప్పారు. ఎటువంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. గుర్తు తెలియని ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

## మహనీయుల జయంతి పోస్టర్ ఆవిష్కరణ

కమాన్ చౌరస్తా, ఏప్రిల్ 10: బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిబాపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతోత్సవాలను పురస్కరించుకొని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నాలుగు రోజులపాటు జరిగే వివిధ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ యూ ఉమేశ్‌కుమార్ కలెక్టర్ చాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 11న ఉదయం 6:30 గంటలకు కరీంనగర్‌లోని గీతాభవన్ నుంచి విశ్వవిద్యాలయం వరకు 3.5 కిలోమీటర్ల ర్యాలీ, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సైన్స్ కళాశాలలో వ్యాసరచన పోటీలు, 12న ఉదయం 8 నుంచి 10గంటల వరకు కామర్స్ కళాశాల ఆవరణలో రంగోలి, 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్విజ్, 13న కామర్స్ కళాశాల సెమినార్ హాల్‌లో కార్యశాల, 14న ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆరట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ సెల్ సమన్వయకర్త డాక్టర్ ఈ మనోహర్ తదితరులు ఉన్నారు.

## చిన్న హనుమాన్ జయంతికి పటిష్ట బందోబస్తు

కరీంనగర్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): చిన్నహనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 12న కరీంనగర్‌లో నిర్వహించనున్న శ్రీవీర హనుమాన్ శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ గౌష్ ఆలం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టౌన్ ఏసీపీ కార్యాలయంలో గురువారం సీపీ నగర పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. శోభాయాత్ర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరిస్వామి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఇన్స్‌పెక్టర్లు సృజన్‌రెడ్డి, జాన్‌రెడ్డి, ఖరీముల్లాఖాన్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో తరుగు, కోత విధించవద్దు : ఎమ్మెల్యే

కలెక్టరేట్, ఏప్రిల్ 10 : కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యంలో తరుగు, కోత విధించకుండా కొనుగోళ్లు చేయా లని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. ధా న్యం కొనుగోళ్లపై పౌరసరఫరాల శాఖ అధికారులు, రైసుమిల్లర్లతో గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్రాల్లో రైతులకు సరైన వసతులు కల్పించాలని సూచించారు. తేమ, తాలు పేరిట కోతలు పెట్టవద్ద న్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రజనీకాంత్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగారావు పాల్గొన్నారు.

## నేడు కరీంనగర్ అడ్వొకేట్స్ అసోసియేషన్ ఎన్నికలు

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 10: ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద న్యాయవాదుల సంఘం అయినా కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘం 2025-26 ఎన్నికలు శుక్రవారం నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను మరిపించేలా జరిగే ఈ ఎన్నికల్లో అభ్యర్థులు ఇప్పటికే పెద్దఎత్తున ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అసోసియేషన్‌లో మొత్తం 927 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షులుగా డీ మల్లయ్య, లింగంపల్లి నాగరాజు, కొరివి వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా కొత్త ప్రకాశ్, చందా రమేశ్, పెంచాల శ్రీనివాస్, సయ్యద్ సాబీర్లులు, ప్రధాన కార్యదర్శిగా కందుల అరుణ్‌కుమార్, చెల్లోజు భూమాచారి, చంద్రపతి కిరణ్‌కుమార్, బూడిద మల్లేశం, శతరాజు ప్రదీప్‌కుమార్ రాజు పోటీలో ఉన్నారు. సంయుక్త కార్యదర్శిగా సుంకే దేవకిషన్, సిరికొండ శ్రీధర్‌రావు, పెరక శ్రీనివాసులు, కోశాధికారిగా ముద్దసాని సంపత్, కీర్తి శ్రీధర్ పోటీలో ఉన్నారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్, లైబ్రరీ, కార్యదర్శి, జూనియర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లకు పలువురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా గంధి రజని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కాసుగంటి మాధవరావు ప్రకటించారు. ఈ ఎన్నికలు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్నారు.

## ఎస్సారార్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

కమాన్‌చౌరస్తా, ఏర్పిల్ 10 : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాల జంతు శాస్త్ర విభాగం విద్యార్థులు జిల్లా కేంద్రంలోని కొత్తపల్లి చెరువును క్షేత్ర పర్యటనలో భాగంగా సందర్శించారు. ఈ పర్యటనలో తృతీయ సంవత్సర సైన్స్ విద్యార్థులు కొత్తపెల్లి చెరువులో సజీవ, నిర్జీవ కారకాలను పరిశోధించి చెరువు నీళ్లలోని సూక్ష్మ జీవకాలను సేకరించారు. కళాశాలలోని జంతు విభాగ ప్రయోగశాలలో ఆ నీటిలో ఉన్న వివిధ రకాల సూక్ష్మ జీవకాలను మైక్రోస్కోప్ కింద చూసి పరిశీలించారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో చెరువులో జీవించే సూక్ష్మజీవుల మీద అవగాహన కలుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట్ల రామకృష్ణ పేర్కొన్నారు. ఇక్కడ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ రవీందర్, డాక్టర్ తోట మహేశ్, సమత, ప్రీతి విద్యార్థులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

గంగాధర, ఏప్రిల్ 10: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని ఏడీ ప్రియదర్శిని హెచ్చరించారు. గురువారం గంగాధర రైతు వేదికలో మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయ దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ డీలర్లు రిజిస్ట్రర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
HOUSE FOR SALE

★ కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును, కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం-1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు.
NTK-337576

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## క్రికెట్ పోటీల విజేత ఠాగూర్ కింగ్స్

గంగాధర, ఏప్రిల్ 10: మండలంలోని మధురానగర్‌లో నిర్వహించిన ఎడ్ల రవీందర్ స్మారక జీపీఎల్ సీజన్ 5 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఫైనల్ పోటీలో ఠాగూర్ కింగ్స్ జట్టు స్నేగ్దన్ సూపర్ కింగ్స్ జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాయకుడు తూడి లచ్చయ్య విజేత జట్టుకు ట్రోఫీ, రూ.20 వేలు, రన్నరప్‌కు ట్రోఫీతో పాటు రూ.10 బహుమతి అందజేశారు. నాయకులు నిమ్మనవేణి ప్రభాకర్, ఆదిపెల్లి అంజయ్య, ఒడ్నాల రాంరెడ్డి, ఉప్పు ప్రశాంత్, మహేశ్, ప్రదీప్, శ్రీహరి రెడ్డి, బాచి,హరీష్, కిరణ్, విజయ్, శ్రీనివాస్, మనోజ్ పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

వీణవంక, ఏప్రిల్ 10 : శ్రీరాములపేట మాజీ సర్పంచ్ కుర్మిండ్ల రాజయ్య (78) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. మండలంలోని శ్రీరాములపేటకు చెందిన రాజయ్య 1990-95 వరకు సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు

## వీడ్కోలు హంగామా

జమ్మికుంట, ఏప్రిల్10 : పట్టణంలోని గాయంత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు హంగామా చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సమావేశంలో కరస్పాండెంట్ ముష్క వీరరాజు మాట్లాడుతూ, విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలన్నారు. అధ్యాపకులు రాగశ్రీ, అంజిబాబు, రమేశ్, భాస్కర్, మధూకర్, సాగర్, రాజేందర్, కిషన్ ఉన్నారు.

## గణిత ఒలింపియాడ్‌లో విద్యార్థికి ప్రథమ స్థానం

చొప్పదండి, ఏప్రిల్ 10 : జిల్లా స్థాయి గణిత ఒలింపియాడ్, హమ్మింగ్ బర్డ్ విభాగంలో మండలంలోని రుక్మాపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థిని సిద్దిక మొదటి స్థానం సాధించింది. జిల్లా విద్యాశాఖ, కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విశేష ప్రతిభ చూపిన సిద్దికను ప్రిన్సిపాల్ సుధాకర్ గురువారం అభినందించారు.

# పార్లమెంట్‌లో బీసీ బిల్లును ఆమోదింపచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గజ్జల కాంతం

తెలంగాణచౌక్, ఏప్రిల్ 10 : బీజేపీ నాయకులకు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి బీసీ బిల్లును అమోదింపచేయాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రజా సంఘుల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బండి సంజయ్‌కుమార్ బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింప చేయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం జరిగేలా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలన్నారు. బీసీ బిల్లును ఆమోదించకుండా కాలయాపన చేస్తే బీసీలు బీజేపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్‌కుమార్, రాష్ట్ర నాయకులు గజ్జల ఆనందరావు, సద్దాల లక్ష్మణ్, కొండ్ర స్వరూప, లత, గొస్కు శంకర్, సంజీవ్ పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు వెళ్తుండగా..

- తాడికల్‌లో రోడ్డు ప్రమాదం
- భార్య మృతి.. తండ్రీకూతురుకు గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 10: చనిపోయిన బంధువు అంత్యక్రియలకు బైక్ వెళ్తుండగా.. ప్రమాదవశాత్తూ కారు ఢీకొని భార్య మృతిచెందగా, తండ్రీకూతురుకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం సోమారం జీపీ పరిధిలోని గర్రెపల్లికి చెందిన కొడగాని కిషన్‌రావు-శోభ (50) దంపతులు వారి కూతురు అశ్వినితో కలిసి బైక్‌పై ఎల్లంపల్లి నుంచి మానకొండూర్ మండలం నిజాయితీగూడెంలో బంధువు అంత్యక్రియలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారు తాడికల్ శివారులోని అండర్ పాస్ వద్దకు రాగానే, ఓ కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిషన్‌రావు, శోభ, అశ్వినికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శోభ మృతి చెందింది. కిషన్‌రావు బామ్మర్ది సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కేశవపట్నం ఎస్ఐ రవి తెలిపారు.

## అల్ఫోర్స్ విద్యార్థులకు బంగారు పతకాలు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 10 : కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ- టెక్నో పాఠశాలలో విద్యార్థులు రాష్ట్ర స్థాయి రీజనింగ్, ఆప్టిట్యూడ్ ఒలంపియాడ్లో బంగారు పతకాలు సాధించగా, విద్యార్థులను విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ సిల్వర్ జోన్ ఫౌండేషన్ పాఠశాల స్థాయిలో నిర్వహించిన రీజనింగ్, ఆప్టిట్యూడ్ ఒలంపియాడ్‌లో పాఠశాలకు చెందిన ఎల్ రామన్, ఎం శివేన్ రెడ్డి, ఎస్‌పీ కృష్ణ చైతన్య, జీ సాయి నంహిత్, పీ శ్లోక, ఎం హిమేశ్‌చంద్ర, డీ ఉదయ శ్రీ పతకాలు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీ తొలగింపుతో వివాదం

గంగాధర, ఏప్రిల్ 10: మధురానగర్ చౌరస్తాలో హోర్డింగ్‌కు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గ్రామ పంచాయతీ అధికారులు తొలగించడం వివాదానికి దారితీసింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొత్త జయపాల్‌రెడ్డి ఫొటోతో కూడిన ఫెక్సీని గట్టుభూత్కూర్ మాజీ సర్పంచ్ ఏర్పాటు చేశారు. అనుమతి లేదంటూ పంచాయతీ కార్యదర్శి సదరు ఫ్లెక్సీని బుధవారం తొలగింప జేయించారు. ఈ విషయం తెలుసుకున్న జయపాల్‌రెడ్డి గురువారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి ఫెక్సీ తొలగింపుపై ఎంపీడీవో రామును ప్రశ్నించారు. అధికార పార్టీ ఫ్లెక్సీలను తొలగించకుండా, కేవలం తన ఫ్లెక్సీని తొలగించాలని ప్రత్యేక నిబంధనలు ఉన్నాయా? ఉంటే లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని ఎంపీడీవోను కోరారు. కక్షపూరితంగా ఫెక్సీలను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా, ఫ్లెక్సీ తొలగింపు విషయం ఈ రోజే తన దృష్టికి వచ్చిందని, త్వరలో విచారణ జరిపిస్తానని వెల్లడించారు.

## సింగిల్ విండో చైర్మన్‌కు ప్రొటోకాల్ లేదా..?

### తహసీల్దార్ తీరుపై నాయకుల ఆగ్రహం

చిగురుమామిడి, ఏప్రిల్ 10 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తహసీల్దార్ మద్దసాని రమేశ్ సింగిల్ విండో చైర్మన్ జంగా రమణారెడ్డికి సమాచారం ఇవ్వకుండా అవమానపరచడం వివాదానికి దారి తీసింది. తహసీల్దార్ సింగిల్ విండో చైర్మన్‌ను కావాలనే అక్కసుతో ప్రొటోకాల్ పాటించకుండా అవమానపరచారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్యతో పాటు పలువురు మండల నాయకులు తహసీల్దార్ తీరును తప్పుపట్టారు. గ్రామాల్లో సమాచారం ఇవ్వడంలో తహసీల్దార్ ఆలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పథకాలను నీరు కార్చేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికార కాంగ్రెస్ నాయకులు సైతం తహసీల్దార్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ తీరు మారకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## ఆరోగ్య మహిళా కార్యక్రమం పరిశీలన

విద్యానగర్, ఏప్రిల్ 10 : నగరంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపును డీఎంహెచ్‌వో వెంకటరమణ పరిశీలించారు. మహిళలకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తపల్లి పీహెచ్‌సీ, ఆరెపల్లి బస్తీ దవాఖానాను తనిఖీ చేశారు. రికార్డులు, మందుల నిల్వలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి ప్రసాద్, డీపీవో స్వామి, తదితరులున్నారు.

## ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి ప్రతిభ

కొత్తపల్లి, ఏప్రిల్ 10 : జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరుగుతున్న ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి సీహెచ్ పూజ అద్భుత ప్రతిభ చూపారు. గురువారం జరిగిన సీనియర్ మహిళల లాంగ్‌జంప్ విభాగంలో పోటీ పడ్డ పూజ ప్రతిభ చూపి 7వ స్థానంలో నిలిచింది. సీనియర్ మహిళల లాంగ్‌జంప్ విభాగంలో జిల్లా నుంచి మొదటిసారిగా పూజ ప్రాతినిధ్యం వహించి సత్తాచాటింది. క్రీడాకారిణిని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు, పలు క్రీడా సంఘాల బాధ్యులు అభినందనలు తెలిపారు.

## అగ్నిప్రమాదాలపై అవగాహన

తెలంగాణచౌక్, ఏప్రిల్ 10 : జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల డిపో-1లో గురువారం జిల్లా అగ్నిమాపక సిబ్బంది అగ్ని మాపక ప్రమాదాల పై డిపో-1 సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా అప్రమత్తంగా ఉండాలి, తీసుకోవాలని జాగ్రత్తల గురించి వివరించారు. ప్రమాదాలను ఎదుర్కొనే విధానాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీఎం విజయమాధురి,సిబ్బంది వీరస్వామి ,కిషన్, ఏవీఆర్‌రెడ్డి, సెక్యూరిటీ గార్డ్. ఆగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## దాతల సాయం అభినందనీయం

జమ్మికుంట, ఏప్రిల్ 10: దివ్యాంగులకు ఉపయోగపడే రేకుల షెడ్డును నిర్మించిన దాతల సాయం అభినందనీయమని సాయి మానసిక దివ్యాంగుల పాఠశాల వ్యవస్థాపకుడు బుచ్చిరాములు అన్నారు. డాక్టర్ ముక్కా నవీన్-స్వాతి కొడుకు నివేశ్ ఇటీవల మృతి చెందగా, నివేశ్ జ్ఞాపకార్థం సాయి మానసిక దివ్యాంగుల పాఠశాలలో రూ.2 లక్షల 50వేలతో రేకుల షెడ్డు నిర్మించారు. సదరు అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. దివ్యాంగుల కోసం దాతులు ముందుకు రావాలని కోరారు.

## ఎస్‌యూ ఫైనాన్స్ ఆఫీసర్‌గా రంజిత చిక్లే

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 10 : శాతవాహన యూనివర్శిటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా రంజిత చిక్లేను నియమిస్తూ గురువారం రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ సెక్రటరీ ఉత్తర్వులు విడుదల చేశారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అకౌంట్స్ ఎగ్జామినర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను డిప్యూటేషన్‌పై శాతవాహన యూనివర్శిటీకి కేటాయించారు.

## అలయన్స్‌క్లబ్ లోగో ఆవిష్కరణ

విద్యానగర్, ఏప్రిల్ 10 : అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ లోగోను గురువారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో నూతన గవర్నర్‌గా ఎన్నికైన చీకోటి శ్రీనివాస్ గాంధీ, ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎలగందుల శ్రీనివాస్‌లు లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవ కార్యక్రమాలకు స్ఫూర్తినిచ్చేదిగా ఉంటుందన్నారు. ప్రతినిధులు మహేశ్, ప్రసాద్, శ్యాం, వెంకటేశ్వర్లు, కుమారస్వామి,నాగేశ్వర్, తదితరులున్నారు.

## 'కల్యాణలక్ష్మి' పేదలకు వరం

శంకరపట్నం, ఏప్రిల్ 10: కల్యాణలక్ష్మి పథకం పేద తల్లిదండ్రులకు వరమని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం వంకాయగూడెం మాధవ సాయి గార్డెన్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. 132 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో క్రిష్ణ ప్రసాద్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఆలయ చైర్మన్ మల్లారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

## గర్భస్రావంతో మహిళ మృతి

విద్యానగర్, ఏప్రిల్ 10: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన మెరుగు సంధ్య (22) గర్భస్రావంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేరింది. సంధ్య అపస్మారక స్థితికి వెళ్లడంతో అక్కడి వైద్యులు వెంటనే కరీంనగర్ మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి గురువారం ఉదయం 4.15గంటలకు తరలించారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రం వైద్యులు అప్రమత్తమై చికిత్సను ప్రారంభించినప్పటికీ పరిస్థితి విషమించడంతో ఉదయం 5.30గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## పనులు త్వరగా పూర్తి చేయాలి

కార్పొరేషన్, ఏప్రిల్ 10 : నగరంలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో గురువారం కమిషనర్ ఎన్టీఆర్ చౌరస్తాలోని ప్రధాన డ్రైనేజీ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం 44వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్‌తో కలిసి స్థానికంగా ఉన్న డ్రైనేజీ కల్వర్టు సమస్యతో పాటు కాలనీలో పలు సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, డీఈ ఓం ప్రకాశ్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక

గంగాధర, ఏప్రిల్ 10: మండల అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగాధర ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా తొందుర్తి చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ, రానున్న అంబేద్కర్ జయంతిని విజయవంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యవర్గానికి సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

## సన్న బియ్యం.. పేదలకు వరం

శంకరపట్నం, ఏప్రిల్ 10: సన్న బియ్యం పేదల పాలిట వరమని కలెక్టర్ ఫమేలా సత్పతి, ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం వంకాయగూడెంలో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం సన్నాల రకాల సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. లబ్ధిదారు చలిగంటి గణేశ్ తమ ఇంట్లో అధికారులు, ఎమ్మెల్యే భోజనం చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలి

చొప్పదండి, ఏప్రిల్ 10 : మున్సిపల్ పరిధిలోని ప్రజలు సకాలంలో ఇంటి పన్ను, నల్లా బిల్లులు చెల్లించి, పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను చెల్లించే వారికి మొత్తం నుంచి 5 శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. ఆస్తిపన్నుతో పాటు నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు అడ్వర్టైజ్మెంట్ ఫీజులు సంబంధిత వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్‌కు చెల్లించి సహకరించాలని కోరారు.

## బీసీలపై రేవంత్‌రెడ్డికి కపట ప్రేమ

కరీంనగర్ రూరల్: ఏప్రిల్ 10: సీఎం రేవంత్‌రెడ్డి బీసీలపై కపట ప్రేమ చూపిస్తూ బీసీలకు అన్యాయం చేస్తున్నారని కరీంనగర్ యూనైటెడ్ పూలే ఫ్రంట్ జిల్లా కన్వీనర్ వరాల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు అన్యాయం చేస్తున్న పరిస్థితి మన కళ్ల ముందు కనిపిస్తున్నదన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం అసెంబ్లీలో పెట్టాలని, పూలే, జీవిత చరిత్రను పాఠ్యపుస్తకంలో ముద్రించాలని, బీసీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిరసనలు చేపడితే, కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిన మాట్లాడడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

## పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

మానకొండూర్, ఏప్రిల్ 10 : పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని, గ్యాస్ ధరలు తగ్గించకుంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం మానకొండూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో రైస్‌మిల్ స్టేజి సమీపంలో సిలిండర్లతో నాయకులు నిరసన తెలిపారు. మండల కార్యదర్శి శాతరాజు భద్రయ్య, సభ్యులు సంపత్, సతీష్, పోచయ్య, ఎలిమి రమేశ్, చిరంజీవి, నర్సయ్య, సంపత్, అరవింద్ పాల్గొన్నారు.

## వైకుంఠ రథం కొనుగోలుకు ఆర్థిక సాయం

కొత్తపల్లి, ఏప్రిల్ 10 : మండలంలోని ఆసీఫ్‌నగర్ గ్రామానికి వైకుంఠరథం కొనుగోలుకు జిల్లా గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ నాయకులు గురువారం ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి వైకుంఠదామం దూరంగా ఉండడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన అసోసియేషన్ నాయకులు రథంకు అయ్యే ఖర్చును పూర్తిస్థాయిలో చెల్లించి అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులకు కొంత మొత్తాన్ని అందించారు. సాయం అందజేసిన అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జువ్వాడి ప్రణీత్‌రావు, నాయకులకు మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్, డీసీసీ జిల్లా కార్యదర్శి దుర్గం అంజయ్య, మాజీ ఎంపీటీసీలు మనోహర్, ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత


సిరిచందనకు నగదు అందజేస్తున్న లచ్చయ్య

గంగాధర, ఏప్రిల్ 10 : ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో మే 5 నుంచి 12 వరకు జరిగే ఏషియన్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని సర్వారెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని మర్రిగడ్డకు చెందిన తూడి సిరిచందన ఎంపికయ్యారు. విషయం తెలుసుకున్న నాయకుడు తూడి లచ్చయ్య గురువారం మండలంలోని మధురానగర్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సిరిచందన గతంలోనూ హాంకాంగ్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారతదేశం తరపున పాల్గొని బంగారు పతకం సాధించారన్నారు. సిరిచందనకు భవిష్యత్తులో మరింత అండగా ఉంటామని తెలిపారు. ఇక్కడ టీఎల్ యూత్ సభ్యులు కోల అజయ్, పిట్టల మనోహర్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్10 : విద్యార్థులు పట్టుదలతో చదివి నైపుణ్యాన్ని పెంచుకొని తల్లిదండ్రుల కలలను నిజం చేసి, ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ అన్నారు. మండలంలోని సింగాపూర్‌లోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన విద్యార్థి ఉత్సవం విబ్జీఆర్ 2025 గురువారం ముగింపు వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ శ్రీనివాస్ జీ హాజరై మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేది డిగ్రీ కోర్సు అని చెప్పారు. అకాడమిక్ అడ్వైజర్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షమిత మాట్లాడుతూ, డిగ్రీ చదివిన విద్యార్థులకు ప్రభుత్వ ప్రైవేటు కార్పొరేట్ రంగాల్లో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, పాటలు అకట్టుకున్నాయి. గెలుపొదిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ తిరుమల్ గౌడ్, డిగ్రీ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంద్రనీల్, ప్రిన్సిపాల్ హనుమకుమార్, వైస్ ప్రిన్సిపాల్ నాంపల్లి రజిత, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## అంతర్జాతీయ 'ఫిడే రేటింగ్'కు ఎంపిక

కొత్తపల్లి, ఏప్రిల్ 10 : బెంగుళూరులోని కంఠీరవ ఇండోర్ స్టేడియంలో ఈనెల 10 నుంచి 13 వరకు జరిగే నమ్మ బెంగళూరు ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్స్ బీ కేటగిరి ఫిడే రేటింగ్ చదరంగ పోటీలకు కరీంనగర్‌లోని విశ్వనాథ చెస్ అకాడమీకి చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు అకాడమీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అకాడమీకి చెందిన కోచ్ ఏ విశ్వనాథ్ ప్రసాద్, క్రీడాకారులు సీహెచ్ కశ్యప్, అమన్‌రావు, అక్షిత్, చైతన్య, శ్రీహాన్, అభయ్‌రాం, కె అకీరా, శివ చైతన్యలు ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపల్లి, ఏప్రిల్ 10 : మేలో నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తిగల పీడీ, పీఈటీ, సీనియర్ జాతీయ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను జిల్లా వ్యాప్తంగా 10 గ్రామీణ ప్రాంతాలలో మే 1 నుంచి 31 వరకు వివిధ క్రీడాంశాలలో నిర్వహించడం జరుగుతుందని, ఆస క్తి, అర్హత గల వారు ఈ నెల 20వ తేదీలోపు తమ పూర్తి వివరాలతో అంబేద్కర్ స్టేడియంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 8008326913 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్10 : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని సీడీపీవో సుగుణ సూచించారు. గురువారం మండలంలోని కాట్రపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా, ప్రీ స్కూల్ మేలా నిర్వహించారు. గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజశ్రీ, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

### భాగస్వామ్య గ్రామీణ అంచనాలపై అవగాహన

జమ్మికుంట, ఏప్రిల్10: మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంలో ఎస్ఆర్‌యూ అగ్రికల్చర్ విద్యార్థులు, కేవీకే ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా భాగస్వామ్య గ్రామీణ అంచనాలపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. యూనివర్సిటీ డీన్ డాక్టర్ భూపాల్‌రాజ్, కో-ఆర్డినేటర్ శ్రీకర్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్త మహేశ్, తదితరులు ఉన్నారు.